క్లుప్తంగా

ఆశ వర్కర్లకు వేతనం చెల్లించండి



పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

నారాయణఖేడ్: ఆశా వర్కర్లకు, కార్మిక వర్గానికి కేంద్ర బడ్జెట్‌లో అరకొరగా నిధులు కేటాయించడం సరికాదని, బడ్జెట్ సవరించి ఆశ వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని సీఐటీయూ ఖేడ్ ఏరియా కమిటీ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. సిర్గాపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశ వర్కర్లతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల స్కీం కేంద్రం బాధ్యత కావున ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు భారతి, అంబిక, సాయవ్వ, నాగమణి, లక్ష్మీ, హేమలత, జూలీ బాయ్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం పోచాపూర్ పాఠశాలను ఎంఈఓ నాగరం శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల బోధన అంశాలు, మధ్యాహ్నభోజనం పథకం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందరమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: మండలంలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయులు గ్రామ శివారులోని పంటపొలాలకు తీసుకెళ్లారు. క్షేత్ర పర్యటనలో భాగంగా వివిధ పంటలను చూయించారు. నేలల రకాలు, వ్యవసాయంలో నూతన విధానాలు, బిందు, తుంపర సేద్యంతో సాగునీటి పొదుపు, అంతర పంటల సాగుతో ప్రయోజనాలు, పంటలను విత్తే విధానం తదితర విషయాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు జగదీశ్వర్, దత్తాత్రి, శివాజీ, గోవింద్ పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని రాపర్తిలో శుక్రవారం డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించారు. ఏఈఓ వెంకటేశం యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు పరిశీలించారు. వరి, జొన్న, మొక్కజొన్న, తదితర పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు పరంధాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు: వ్యవసాయాధికారి



తనిఖీలు నిర్వహిస్తున్న ఝూన్సీ

సంగారెడ్డి టౌన్: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఝూన్సీ హెచ్చరించారు. మండలంలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట ఫెర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...విత్తనాలను, ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు అమ్మకూడదని, విక్రయించిన అనంతరం రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. స్టాక్ బోర్డును తప్పనిసరిగా కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో మండలశాఖ అధికారులు, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

పనులు వెంటనే నిలిపివేయాలి

పటాన్‌చెరు టౌన్: గుమ్మడిదల మండలంలో ఏర్పాటు చేసే డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం బృందం ప్యారానగర్‌లో పర్యటించి ప్రజల నుంచి సమాచారం సేకరించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈశ్వర్, విష్ణు, యాదగిరి పాల్గొన్నారు.

‘నులి’ పేద్దాం..!

- పిల్లల ఎదుగుదలపై నట్టల ప్రభావం
- నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు
- 1–19 ఏళ్లలోపు వారంతా విధిగా వేసుకోవాలి
- జిల్లాలో 4,05,207 మందికి మాత్రలు వేయాలని లక్ష్యం
- ఈ నెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవం



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది(ఫైల్)

సదాశివపేటరూరల్ (సంగారెడ్డి): ఆరోగ్య సమాజ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీఏటా నులిపురుగుల (నట్టల) నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల లోపు 4,05,207 పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు సంబంధించి జిల్లాలోని ఏఎన్ఎంలకు, ఆశవర్కర్లకు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులకు ప్రత్యేక అధికారులు శిక్షణనిచ్చారు. అదేవిధంగా జిల్లాలోని పీహెచ్‌సీలకు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా మాత్రలను సరఫరా చేస్తున్నారు. నులిపురుగుల వల్ల వచ్చే ఇబ్బందులు, నివారణ చర్యలతో కూడిన కరపత్రాలు,పోస్టర్లు పీహెచ్‌సీల వారీగా సరఫరా చేశారు.

ఇలా వేయాలి...

ఒకటి నుంచి రెండేళ్ల పిల్లలకు సగం మాత్ర స్పూన్ ద్వారా పొడి చేసి నీటిలో వేయాలి. దీనిని మధ్యాహ్న భోజనం తర్వాత వేయాల్సి ఉంటుంది. 2 నుంచి 3 ఏళ్ల పిల్లలకు పూర్తి మాత్రను పొడిచేసి వేయాలి. 3 నుంచి 19 సంవత్సరాల వారికి చప్పరించి లేదా నమిలి మింగేటట్లు చూడాలి.

అపరిశుభ్రత వల్లే నులి పురుగులు

చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారాన్ని తినడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, అపరిశుభ్రమైన పరిసరాల వల్ల నులిపురుగు వ్యాప్తి చెందుతుంది. దీనిని నివారించేందుకు షూ ధరించడం, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి.

నులి పురుగులతో అనేక అనర్థాలు

నులి పురుగులు పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి,వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో శారీరక, మానసిక పెరుగుదల తగ్గిపోతుంది. విద్యార్థుల్లో ఏకాగ్రత తగ్గిపోతుంది.

> **ఆల్బెండజోల్‌తో నిర్మూలించవచ్చు**
>
> ఆల్బెండజోల్‌తో రక్తహీనతను నియంత్రించడమేగాక వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి
>
> –శశాంక్ దేశ్ పాండే, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ సాంబశివరావు



ఫర్నిచర్ అందజేస్తున్న సాంబశివరావు

వట్‌పల్లి(అందోల్): విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ సాంబశివరావు అన్నారు. శుక్రవారం అందోలు మండలం అక్సాన్‌పల్లి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో జోగిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రోటరీ క్లబ్ సహకారంతో సుమారుగా రూ.లక్షన్నర విలువ చేసే ఫర్నిచర్‌ను ఉచితంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జోగిపేట లయన్స్‌క్లబ్ ద్వారా ఈ పాఠశాలలో ఫర్నిచర్ అవసరం ఉందని తెలుపగానే అందించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్ వారికి పాఠశాల ప్రిన్సిపాల్ రియాజొద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్, ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ అనంతరెడ్డి, గ్రామ మాజీ ఏజీపీ హరినారాయణ వర్మ, జోగిపేట లయన్స్ జిల్లా చైర్మన్ ఎ.రాంబాబు, క్లబ్ కార్యదర్శి జీఆర్.మధుసూదన్‌రెడ్డి, సభ్యుడు పీ.సంతోష్‌కుమార్, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, కోశాధికారి వై.మీర, సేవా ప్రాజెక్టు డైరెక్టర్ రాజ క్రిష్ణ, డైరెక్టర్ లక్ష్మీరెడ్డి, న్యాయవాది నవీన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఈ చీకటి తొలగించరేమి?

- అంధకారంలో చెర్ల గోపులారం
- ఏడాదిగా గ్రామాల్లో ప్రత్యేక పాలన
- సమస్యలపై కన్నెత్తి చూడని అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోవడంతో ఏడాదికాలంగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీంతో అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడం, పంచాయతీ కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండకపోవడంతో అభివృద్ధి కుంటుపడి ఎక్కడ నెలకొన్న సమస్యలు అక్కడే అపరిష్కృతంగా నిలిచిపోయాయి. మండల పరిధిలోని చర్ల గోపులారం గ్రామంలో వీధిలైట్లు లేకపోవడంతో రెండు నెలల నుంచి రాత్రిళ్లు రోడ్లన్నీ చీకటిమయంగా మారిపోతున్నాయి. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ లైట్లు లేక ఇళ్లలోకి విషపురుగులు వచ్చేస్తున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించకుండా విధులకు గైర్హాజరవుతున్న గ్రామ కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వీధిలైట్లు లేకపోవడంతో చీకటిమయంగా మారిన చెర్ల గోపులారం

శివస్వాముల పాదయాత్ర



శ్రీశైలం వెళ్తున్న దౌల్తాబాద్ శివ స్వాములు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామంలో శివదీక్ష స్వీకరించిన స్వాములు గురుస్వామి శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీశైలంకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురవీధులు శివనామస్మరణతో భజన సంకీర్తనలతో మార్మోగాయి. కార్యక్రమంలో గురుస్వామి ఆంజనేయులు, వివిధ గ్రామాల శివ దీక్ష స్వాములు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాచెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ. 2 వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

అవగాహన అవసరం

వట్‌పల్లి(అందోల్): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తులు హరినారాయణవర్మ, అల్లె శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం అందోలు మండల పరిధిలోని బ్రహ్మణపల్లి, అక్సాన్‌పల్లి పాఠశాలల్లోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, మైనర్ వాహనాలు నడపడం, పోక్సో కేసు వంటి చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

ఉత్సవాలు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని హనుమాన్ మందిరంలో వినాయక, కుమారస్వామి, దత్తత్రేయ స్వామి, నవగ్రహాలు, పంచ నాగుల దేవత విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 9 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా యజ్ఞం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించండి



కార్మికులకు కాస్మోటిక్ వస్తువులను అందజేస్తున్న కమిషనరు జగ్జీవన్

నారాయణఖేడ్: పారిశుద్ధ్య కార్మికులు తమతమ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాస్మోటిక్ వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పరిశుభ్రత విషయంలో కార్మికులదే కీలక పాత్ర అని అన్నారు. తెల్లవారు జామునే విధుల్లోకి దిగి పారిశుద్ధ్య పనులు చేస్తూ స్వచ్ఛతకు పాటుపడుతున్నారన్నారు. పారిశుద్ధ్య పనులు చేసేటప్పుడు చేతులకు తొడుగులు ధరించాలన్నారు. పనుల అనంతరం సబ్బు, నూనెతో చేతులను శుభ్రం చేసుకోవాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సన్మానం

పటాన్‌చెరు: ఎస్సీ వర్గీకరణ, 42 శాతం బీసీ కుల రిజర్వేషన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు నగేష్ యాదవ్, అశోక్ ముదిరాజ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డంపింగ్ యార్డ్ బీఆర్‌ఎస్ పాపమే

జిన్నారం(పటాన్‌చెరు): ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు గత ప్రభుత్వమే అనుమతులు ఇచ్చిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గుమ్మడిదల మున్సిపాలిటీలోని కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నర్సింగరావు ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమస్యను పరిష్కరించేందుకు పార్టీలకతీతంగా కలిసి పోరాడేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మద్దివీరారెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రతాప్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ గౌడ్, నారబోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నులి పురుగులను నివారిద్దాం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆశా వర్కర్లు, వార్డు ఆఫీసర్లు శుక్రవారం నులి పురుగుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి రాజాకుమారి మాట్లాడుతూ 10 నుంచి మున్సిపల్ పరిధిలో 1 నుంచి 19 ఏళ్ల వయసులోపు విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జిన్నారం (పటాన్‌చెరు): జాతీయ పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుకర్, ఎంపీడీఓ ఉమాదేవి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఏఐపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైనింగ్, రెస్యూమ్ తయారీపై ఒకరోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం క్లోప్రోసిస్ ఐటీ సర్వీసెస్ సీఈఓ అమీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్లౌడ్ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ సురేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దు

నారాయణఖేడ్: వరిలో కాంప్లెక్స్ ఎరువులను వాడకూడదని ఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన నిజాంపేట శివారులోని వరిపొలాలను ఏఈఓ వంశీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఎదుగుదలకు దుక్కిలో మాత్రమే డీఏపీ కాని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మందును మాత్రమే వాడాలన్నారు. యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరిస్తూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను విధిగా పాటించాలన్నారు. డిజిటల్ పంట సర్వేలో భాగంగా డివిజన్ పరిధిలోని రైతులందరూ నమోదు చేయించుకోవాలని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

సంక్షిప్త వార్తలు

◆ మూడో రోజుకు చేరిన నిరసన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన మూడో రోజుకు చేరాయి. శుక్రవారం నల్లవల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు గ్రామంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు.

◆ నూతన కమిటీ సభ్యులకు సన్మానం

పటాన్‌చెరు/రామచంద్రాపురం: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యులను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుధారాణి శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు.

◆ ఖేడ్‌లో అడ్మిషన్ డ్రైవ్

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం శుక్రవారం అడ్మిషన్ డ్రైవ్ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్ అధ్యాపకులతో కలిసి అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా సందర్శించారు. జూనియర్ కళాశాలలో బోధన, వసతులు, సదుపాయాలను గురించి వివరించారు. పదోతరగతి పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులై వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని విద్యార్థులకు సూచించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మార్డికి చెందిన సానియా బేగంకు రూ. 15 వేలు, ఫతేపూర్‌కు చెందిన భార్గవికు రూ. 10 వేలు, పోమ్యానాయక్ తండాకు చెందిన మీరాబాయికు రూ. 14,500 చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాంసింగ్, నాయకులు గణపతి, జనార్ధన్, సుధాకర్, వెంకట్‌నాయక్, పర్లాల్, రాంసింగ్ పాల్గొన్నారు.

◆ బీరప్ప మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్‌లో బీరప్ప మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పిట్లంకు చెందిన గంగాధర్ పంతులు ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గొల్లకురుమ సంఘం నాయకులు సాయిగొండ, కేశిగొండ, గంగదాస్, తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్వోసీ అందజేత




నారాయణఖేడ్: న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్‌కు చెందిన భోజప్పకు ప్లేట్‌లెట్లు తగ్గి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జహీరాబాదు ఎంపీ సురేశ్ షెట్కార్ సిఫార్సుతో అత్యవసర వైద్యంలో భాగంగా ఆస్పత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల మంజూరుకు సంబంధించి ఎల్వోసీ ఉత్తర్వు జారీ అయింది. ఉత్తర్వును శుక్రవారం కాంగ్రెస్ జాతీయ స్పోక్‌పర్సన్ డా. గిరిజా షెట్కార్ బాధితుడి కుటుంబీకుడికి అందజేశారు.

◆ ఎస్సీ వర్గీకరణపై మంత్రికి కృతజ్ఞతలు

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టడంతో మండలానికి చెందిన ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ కల నెరవేరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ సంకల్పం వల్లే వర్గీకరణ సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్ కల్యాణ్, డైరెకర్ పాపయ్య, ప్రభాకర్, శంకర్, యాదయ్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి సర్వతోముఖ యాగం



సర్వతో ముఖ యాగానికి ఏర్పాట్లు

ఝరాసంగం(జహీరాబాద్): కృష్ణాపూర్ శివారులోని దత్త మార్తాండ మందిరం ముక్తాశ్రమంలో శనివారం నుంచి సర్వతోముఖ యాగం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ శివారులోని ప్రధాన రహదారి నుంచి ఆశ్రమం వరకు రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మహాయాగం కర్ణాటక రాష్ట్రం మత్తూరుకు చెందిన 68 మంది రుత్వికులచే ఏకకాలంలో నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. ఆశ్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ముక్తాశ్రమంలో భారీగా ఏర్పాట్లు

యాగం ప్రత్యేకత

లోక కళ్యాణార్థం, మానవాళి సుఖశాంతులతో ఉండేందుకు మహాయాగం నిర్వహించనున్నారు. సాధారణంగా చేసే ప్రతి యాగం ఒకే దిశలో ఉంటుంది కానీ ఇక్కడ నిర్వహించే యాగం నాలుగు దిక్కులతో కలిపి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రావీణ్యం కలిగిన వేద పండితులచే ఒకే యాగశాల క్రింద నాలుగు సోమయాగాలు నిర్వహించనున్నారు. నాలుగు దిక్కులలో ద్వారాలు ఏర్పాటు చేసి మహా యాగం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత.



ప్రత్యేక అలంకరణలో శ్రీ ప్రభుదాస్ మహారాజ్